సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తా..



33వ వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేషకుమార్ తదితరులు

అల్లిపురం: నియోజకవర్గ ప్రజల ప్రతి సమస్యనూ పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ హామీ ఇచ్చారు. 33వ వార్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. నీలమ్మ వేపచెట్టు ప్రాంతం, బంగారమ్మమెట్ట ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ పాలనపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డు పర్యటనలో ప్రజల కళ్లలో ఆనందం కనిపిస్తోందన్నారు. కుళాయి నీరు, ఆరోగ్యశ్రీ కార్డు లేనివారు, గృహనిర్మాణాలు తదితర సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. పర్యటనలో కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, స్టేట్ డైరెక్టర్లు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలన జగనన్నతోనే సాధ్యం



అచ్చయ్యమ్మపేట ప్రజా దర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అవినీతి రహిత పాలన సాధ్యమని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. జగనన్న ఆశయంతో ప్రజాసేవే పరమావధిగా భావిస్తూ అనునిత్యం ప్రజలతోనే మమేమకమై ఉంటున్నామన్నారు. 32, 33, 34 వార్డులకు సంబంధించి అచ్చియ్యమ్మపేటలో, 36వ వార్డుకు సంబంధించి ఏవీఎన్ కాలేజీ వద్ద శుక్రవారం జరిగిన ముస్లిం ప్రజా దర్బార్‌లో ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించి అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. అర్హులైన పేదలకు ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా ప్రభుత్వ పథకాలు చేరుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో ప్రతి పనికి లంచాలతో పని ఉండేదని, అయినప్పటికీ లబ్ధిదారులకు న్యాయం జరిగేది కాదన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఎవరి సహాయం లేకుండా సచివాలయాల ద్వారా నేరుగా ప్రజలు లబ్ధి పొందుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, స్టేట్ డైరెక్టర్లు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అల్పాహారం



ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న పీతల వాసు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు రామజోగిపేట రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన అయ్యప్ప ఇరుముడి కార్యక్రమంలో మాలధారులకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పీతల వాసు అల్పాహారం ఏర్పాటు చేశారు. గురుస్వాములు ఉరుకూటి మంగరాజు, జోగా శ్రీకాంత్, గరుడా జగన్నాయకుల సత్రం డైరెక్టర్ తమ్మినేని శ్రీనివాస్, బుల్లెట్ రవి, కోరాడ సురేష్, అడపా శివ, పీతల మహేష్, చరణ్, శ్రీను పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సీతమ్మధార: జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు మానవహారం చేపట్టారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లను అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. శనివారం కార్మికులంతా ఫ్యాక్టరీలు, మున్సిపాల్ వార్డు ఆఫీస్‌ల ఎదుట పనిప్రదేశాల్లో సంఘీభావ కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, యూనియన్ గౌరవ అధ్యక్షురాలు పి.మణి, మేరీ, పద్మ, తులసీ, వెంకటలక్ష్మి, శాబారాణి, సీతారత్నం, టి.నూకరాజు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పాత నగరానికి కొత్త కళ

అంబుసారంగవీధి	అంబుసారంగ వీధి	థామ్సన్ వీధి	ఎంవీడీఎం స్కూల్ వద్ద	ఉడేయార్డు స్ట్రీట్	మౌలాలి పంజా
రూ. 13 లక్షలు	రూ. 7 లక్షలు	రూ. 5 లక్షలు	రూ. 13 లక్షలు	రూ. 7 లక్షలు	రూ. 15 లక్షలు
డ్రైనేజీ నిర్మాణం	సీసీ రోడ్ల నిర్మాణం	సీసీ రోడ్ల నిర్మాణం	సీసీ రోడ్ల నిర్మాణం	సీసీ రోడ్ల నిర్మాణం	డ్రైనేజీల నిర్మాణం



అంబుసారంగవీధిలో జరుగుతున్న డ్రైనేజీల నిర్మాణం

జగదాంబ: పాత నగరం కొత్త సొబగులు అద్దుకుంటోంది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వార్డుల్లో ప్రధాన రహదారుల నుంచి వీధుల్లో ఉన్న రోడ్లన్నింటిని కొత్తగా నిర్మిస్తున్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో వీధుల్లో కాల్వలు.. రోడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. నగర పరిధిలో ఉన్నా రోడ్లు అధ్వానంగా ఉండటంతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడేవారు. ఈ తరుణంగో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రహదారుల నిర్మాణం చేపట్టింది. ప్రధాన రహదారులతో పాటు వీధుల్లోని చిన్న చిన్న సందుల్లో కూడా సీసీ రోడ్లు, కాల్వలు నిర్మిస్తుండటంతో వీధులన్నీ పరిశుభ్రంగా కళకళలాడుతున్నాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చి వార్డుల్లో అభివృద్ధి వెలుగులు నింపడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

39వ వార్డులో అభివృద్ధి ఇలా..

జీవీఎంసీ 39వ వార్డు అంబుసారంగవీధి, పెద్రివీధి, కన్వేయర్ బెల్ట్, థామ్సన్ వీధి, కోట వీధి, పెద్రి వీధి, చిలకపేట, సెయింట్ అలాయిషస్ స్కూల్ వీధితో పాటు అన్ని వీధుల్లో కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు.



ఎస్ఎల్ కెనాల్ వద్ద రూ. 15 లక్షలతో ..

రామకృష్ణనగర్ వద్ద ఉన్న ఎస్ఎల్ కెనాల్ వద్ద రూ. 15లక్షలతో పది మీటర్ల సీసీ ర్యాంప్ నిర్మాణం చేయడంతో మురుగు నీరు ప్రవాహానికి అడ్డు తొలగింది. గతంలో మురుగుకు చెత్త అడ్డు పడటంతో నీరు ప్రధాన రహదారిపైకి, రామకృష్ణ వీధిలోకి ప్రవహించి ప్రజలను ఇబ్బందికి గురి చేసేది. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం కెనాల్‌లోకి జేసీబీ వంటి వాహనాలు పంపించి చెత్త సేకరణ చేసేందుకు వీలుగా ర్యాంప్ నిర్మాణం చేయడంతో ఈ సమస్య పూర్తిగా తొలగింది. అంతే కాకుండా కెనాల్ దరి ఉన్న రామకృష్ణవీధి వద్ద కూడా రూ. 6 లక్షలతో ఎనభై మీటర్లు పొడవునా కాలువ నిర్మాణం కూడా చేపట్టారు.



థామ్సన్ వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు



ఎర్రి రోడ్డులో నిర్మించిన సీసీ రోడ్డు

సంతోషంగా ఉంది



మురికివాడల్లో సీసీ రోడ్లు నిర్మించడంతో చాలా సంతోషంగా ఉంది. ఒక్కటి కాదు రెండు కాదు.. కొన్నేళ్లుగా శిథిలావస్థలో ఉన్న రహదారులపై నే నడవాల్సి వచ్చింది. ప్రభుత్వం రోడ్లు వేయడంతో ప్రధాన సమస్య తీరింది.

– యాండ్రి సన్యాసిరావు, 39వ వార్డు

కొత్తకళ వచ్చింది



కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన రోడ్లకు గత ప్రభుత్వంలో కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదు. అందువల్ల రోడ్లన్నీ దాదాపు శిథిలమైపోయాయి. మళ్లీ ఇన్నాళ్లకు నిర్మాణాలు చేపట్టడంతో కొత్త కళ వచ్చింది.

– శ్రీనివాసరావు, 39వ వార్డు

వీధులు బాగు పడ్డాయి



వైఎస్సార్ సీపీ పుణ్యమాని వీధుల్లో కాలువలు బాగుపడ్డాయి. అందరూ చేస్తామని చెప్పడమే గానీ, ఎవరూ పనులు చేపట్టలేదు. ఇన్నాళ్లకు జగన్‌బాబు పుణ్యమా అని మా వీధుల్లో అభివృద్ధి జరుగుతోంది. ఇలా అభివృద్ధి చేసే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ రావాలి.

– బిలాల్ , 39వ వార్డు

నాలుగేళ్లలో ఎంతో అభివృద్ధి



వైఎస్సార్ సీపీ నాలుగేళ్లలో ఎంతో అభివృద్ధి చేసింది. వార్డుల్లో చిన్న చిన్న సీసీ రోడ్లతో సహా నిర్మించారు. ప్రజల సంక్షేమానికి కూడా ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారు.

– శివ, 39వ వార్డు

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



పేదలకు ఆహారం అందిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు



బంగారుమెట్టలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న రంథి గోపి తదితరులు

అల్లిపురం: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్థంతి సందర్భంగా శుక్రవారం వాడవాడలా ఘనంగా నివాళులర్పించారు. అల్లిపురం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ వద్ద జరిగిన కార్యక్రమంలో క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ వరిగల వందు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు సేవలను కొనియాడారు. క్లబ్ ప్రెసిడెంట్ డీవీఎస్ఎస్ రాజు మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాలకు పొట్టి శ్రీరాములు విశేష కృషి చేశారన్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు ఎస్.సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రటరీ దాసు విజయకుమార్, సభ్యులు గుప్తా, దాసు అమ్మాజీ, సుజాత, సత్యదేవ్, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో..

వైఎస్సార్‌సీపీ 33వ వార్డు సీనియర్ నాయకుడు రంథి గోపికృష్ణ ఆధ్వర్యంలో బంగారుమెట్ట కమ్యూనిటీ హాల్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు నీలాపు అయ్యప్పరెడ్డి, చిన్నమ్మలు, భీశెట్టి రాజు, మదీనాఖాన్, ఈశ్వరరావు, కళ, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు సీఎం జగన్

- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- 41వ వార్డులో చేపల మార్కెట్ ప్రారంభం



మత్స్యకార మహిళలతో చేపల మార్కెట్లో ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ పూర్ణిమ

డాబాగార్డెన్స్: ప్రజలకు సుపరిపాలనతోపాటు మంచి నాయకత్వం ఎలా ఉండాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి నేర్చుకోవాలని టీడీపీ అధినేత చంద్రబాబుకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ హితవు పలికారు. జీవీఎంసీ 41వ వార్డులో రూ.4.90 లక్షలతో ఆధునికీకరించిన చేపల మార్కెట్‌ను శుక్రవారం కార్పొరేటర్ కోడి గుడ్ల పూర్ణిమతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ టీడీపీకి.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య సముద్రమంత తేడా ఉందన్నారు. ఏ సమస్య అయినా జగనన్న దృష్టికి వెళ్తే.. మాట ఇస్తే మడమ తిప్పని నేతగా పనిచేస్తారన్నారు. ఎండనకా, వాననక రోడ్లపై వ్యాపారం చేసుకునే మత్స్యకార మహిళలకు ఈ సముదాయం బాసటగా నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు



క్షీరాభిషేక సేవలో సిరుల తల్లి

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల రెండో రోజు శుక్రవారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన అనంతరం 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనాలు కల్పించారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం అనంతరం మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనాలు కల్పించారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకాలు, అష్టోత్తర నామార్చన నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

క్షీరాభిషేక సేవ : ప్రతి శుక్రవారం ఉదయం 8 గంటలకు నిర్వహించే క్షీరాభిషేక సేవలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

మండపంలో వైదిక కార్యక్రమాలు : మండపంలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శ్రీచక్రనవావరణార్చన, లక్ష్మీహోమం, మార్గశిర మాస విశేష కుంకుమార్చన, అష్టోత్తర కుంకుమార్చన, వేదపారాయణ, సప్తశతీ పారాయణ, మహా విద్యాపారాయణ నిర్వహించారు. ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు మార్గశిర మాస విశేష కుంకుమార్చనలు జరిపారు. మధ్యాహ్నం 3 వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి కె శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

'మిస్ దివా యూనివర్స్' శ్వేతా శార్దా సందడి



కమల్ వాచ్ షోరూంను ప్రారంభిస్తున్న శ్వేతా శార్దా

సీతమ్మధార: ఆశీలమెట్టలో కమల్ వాచ్ బ్రాంచ్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథి లివా మిస్ దివా యూనివర్స్ శ్వేత శార్దా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముందుగా ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి షోరూంను ప్రారంభించారు. పలు బ్రాండ్ వాచ్‌లు, మోడల్స్‌తో కలిసి రాంప్ వాక్ చేస్తూ సందడి చేశారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

31న రెడ్డి కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం

సీతమ్మధార: వేమన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ ఆదివారం ముడసర్లోవ రోజ్ గార్డెన్స్‌లో రెడ్డి కుటుంబాల ఆత్మీయ సమ్మేళన వనభోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు నీలాపు వివేకానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పలు కార్యక్రమాలు, పిల్లలు, మహిళలకు ఆటలు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యాజిక్ షో, తంబులా, ప్రతిభ గల విద్యార్థులకు అతిథులచే స్కాలర్‌షిప్, పోటీల విజేతలకు బహుమతులు అందిస్తామని చెప్పారు. వివరాలకు 90306 55681 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దళిత విముక్తి ప్రతిఘటనా సదస్సు రేపు



నినాదాలు చేస్తున్న సుర్ల వెంకటరమణ తదితరులు

సీతమ్మధార: దళిత విముక్తి 25 ఏళ్ల ఉద్యమ ప్రస్థాన నేపథ్యంలో ఈ నెల 17న ప్రతిఘటనా సదస్సు, ర్యాలీ నిర్వహిస్తున్నామని దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డాబాగార్డెన్స్ ప్రేమ సమాజం హాల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు సదస్సుతోపాటు సాయంత్రం 4 గంటలకు సభా స్థలం నుంచి ఎల్ఐసీ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బి.అప్పారావు, జి.డి.సారయ్య, బి.రామకృష్ణ, బి.సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: ప్రజాదర్బార్‌లో వచ్చిన వినతులపై స్పందించిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం పలువురి ఇళ్లకు వెళ్లి పరామర్శించి, రూ.38,500 ఆర్థిక సాయం అందజేశారు. 32వ వార్డు సంతోషిమాత గుడి ప్రాంతానికి చెందిన వెనంగి రాజేశ్వరి, 33వ వార్డు మిరపకాయల వీధికి చెందిన కంది సూరమ్మ, 31వ వార్డు కనకలవీధికి చెందిన కాకర్ల అప్పారావు కుటుంబానికి ఆర్థిక సహకారం అందించారు. 29వ వార్డు ప్రకాశరావుపేటకు చెందిన బోగాపురపు శ్రీనివాసరావు, 30వ వార్డు రెల్లివీధి ప్రాంతానికి చెందిన పిల్లా అప్పయ్య, 38వ వార్డు బుక్కావీధికి చెందిన మైలపిల్లి నరసింహులుకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఆయా వార్డుల నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

'విధుల నుంచి అన్యాయంగా తొలగించారు'

డాబాగార్డెన్స్: ఎల్ అండ్ టీ అపెక్స్ లాజిస్టిక్స్‌లో గ్రేడ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న తనను అన్యాయంగా విధుల నుంచి తొలగించారని ప్రగడ ప్రసాదరావు వాపోయారు. స్కిల్ వర్కర్ అయిన తనను ఆరేళ్లుగా సెమీ స్కిల్ వర్కర్‌గా పనిచేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ, తనతోపాటు వందలాది మందికి వేతనాలు ఇవ్వడం లేదని ఇటీవల ధర్నా చేపట్టామని, యాజమాన్యం దిగి వచ్చి జీతాలు చెల్లించిందని శుక్రవారం లేబర్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. తనను స్కిల్ వర్కర్‌గా గుర్తించాలని ఆందోళన చేపట్టడంతో తనతోపాటు పి.అప్పలరాజు, జి.మురళీలను విధుల నుంచి అన్యాయంగా తొలగించారని ఆరోపించారు. దీనిపై లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.

చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం

- డీఆర్ఎం, కేవీ చైర్మన్ సౌరభ్ ప్రసాద్
- ఘనంగా కేంద్రీయ విద్యాలయ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్



విన్యాస ప్రదర్శనలో కేవీ వాల్తేర్ విద్యార్థులు

తాటిచెట్లపాలెం: నేటి సమాజంలో చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయని డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం), కేవీ వాల్తేర్ చైర్మన్ సౌరభ్ ప్రసాద్ అన్నారు. తాటిచెట్లపాలెం పోర్ట్ గోల్డెన్ జూబిలీ హాస్పిటల్ ఎదురుగా గల కేంద్రీయ విద్యాలయ వాల్తేర్ ఆవిర్భావ దిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ముందుగా అలుమ్ని సభ్యులు సమకూర్చిన వ్యాయామ వేదికను అలుమ్ని సభ్యులు, కేవీ వాల్తేర్ ప్రిన్సిపాల్ కమల్‌జీత్ ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయ ఆవిర్భావం, చరిత్రను గురించి వివరించారు. డిసెంబర్ 15న దేశవ్యాప్తంగా సుమారు 1,250 కేంద్రీయ విద్యాలయాలు వ్యాప్తి చెందడమే కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా కూడా విస్తరించి ఉన్నాయన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ విద్యార్థులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేసి మాట్లాడారు. కేవీ విద్యార్థులు పలు క్రీడల్లో రాణిస్తున్నారని ప్రశంసించారు. విద్యార్థులు, యోగా, జిమ్నాస్టిక్స్, శాస్త్రీయ సంగీతం, ఎరోబిక్స్, నాట్యం , వంటి పలు ప్రత్యేక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మీన్స్, పీటీ టీచర్ రియాజ్‌ఖాన్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వి.ఎం.శైలజ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది రాణి, గిరి, గీత, సబ్రీన్, త్యాగరాజు, రేఖ, విజయలక్ష్మి, నాగమణి, కుందన్ లాన్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరమెట్ట దేవస్థాన భూ సమస్యపై వినతి



ప్రిన్సిపల్ సెక్రటరీ కరికల్ వలవన్‌ను కలిసిన అసోసియేషన్ సభ్యులు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్ట దేవస్థానానికి చెందిన భూ సమస్యను పరిష్కరించాలని వెంకటేశ్వరమెట్ట హౌస్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తాడేపల్లిలో దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కరికల్ వలవన్, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణలను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. వారితో పాటు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాల మేరకు హైకోర్టు న్యాయవాది, రాజన్న ఆటోనగర్ లీగల్ అడ్వయిజర్ పిరికి వరప్రసాద్, ఆటోనగర్ అధ్యక్షుడు ఖాజావల్లిలు ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్‌లను కలిసి గాజువాకలో వెంకటేశ్వరమెట్ట దేవస్థానానికి కేటాయించిన ప్రత్యామ్నాయ స్థలం కోసం వివరించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో వెంకటేశ్వరమెట్ట హౌస్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు భీశెట్టి శ్రీను, శరగడం మోహన్‌రావు, కోరిబిల్లి ప్రసాద్ ఉన్నారు.

చిరస్మరణీయుడు మారెడ్ల సత్యనారాయణ



మారెడ్ల వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న దువ్వూరి సత్యనారాయణమూర్తి తదితరులు

డాబాగార్డెన్స్: ప్రేమసమాజం వ్యవస్థాపకుడు మారెడ్ల సత్యనారాయణ చిరస్మరణీయుడని ప్రేమసమాజం కార్యవర్గ సభ్యులు కొనియాడారు. మారెడ్ల వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రేమసమాజం అధ్యక్షుడు బుద్దా శివాజీ, సభ్యులు కోన జగదీశ్వరరావు, ఎస్.సత్యనారాయణ, పి.గణపతిరావు, పి.రాము, డి.సింహాచలం, వీకే సురేష్ మారెడ్ల సత్యనారాయణ, మహాలక్ష్మమ్మ దంపతుల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా ఆశ్రమవాసులు, బాలబాలికలు ప్రభాతభేరి నిర్వహించారు. ఈ సందర్భంగా బీటీ కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ దువ్వూరి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలని మానవత్వంతో ప్రేమసమాజాన్ని స్థాపించిన మారెడ్ల ఆదర్శమూర్తిగా నిలిచారన్నారు. ప్రేమసమాజం ఉన్నంత కాలం ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. కార్యదర్శి కె.హరి మోహనరావు మాట్లాడుతూ శరణాలయాలు లేని రోజుల్లో విశాఖలో ప్రేమసమాజాన్ని స్థాపించి మారెడ్ల ధన్యజీవులయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రేమసమాజం స్థాపకుల కుటుంబ సభ్యులు, కోశాధికారి ఎంవీవీకె గుప్తా, కార్యవర్గ సభ్యులు డబ్ల్యూ భాస్కరరావు, భగవత్ పరమేశ్వర్, ఎస్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.